క్లుప్తంగా

జోనల్ స్థాయి క్రీడలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి: హిందూపురంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయిలో క్రీడా పోటీల్లో శిరివరం జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ సంపత్ కుమార్ గురువారం తెలిపారు.స్ఫూర్తి అనే విద్యార్థి 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం , ప్రణీత్‌కుమార్ షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానంలోను, మైత్రీ, మంజునాథ్ అనే విద్యార్థులు ద్వితీయ స్థానంలో విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం శ్రీనాథ, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పరిగి బస్టాండ్ వద్ద రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: హిందూపురంలోని పరిగి బస్టాండ్ వద్ద రూ.44.66 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలకృష్ణ ఏడాది క్రితం శంకుస్థాపన చేశారు. ఆతర్వాత పట్టించుకోలేదు. గత నెలలో 'సాక్షి'లో 'దారి..భూమి పూజతో సరి' శీర్షికన ప్రచురితమైంది. దీనిపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ రహదారి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

స్వామినాథన్ సేవలు మరువలేనివి

పెనుకొండ: వ్యవసాయ రంగానికి స్వామినాథన్ సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ జయంతి సందర్భంగా రైతు సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు హరి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి స్వామినాథన్ ఎనలేని కృషి చేశారన్నారు. నాయకులు బాబావలి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

మడకశిర: గంబూసియా చేపల ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా తెలిపారు. ఆయన గురువారం పట్టణంలోని బావులు, కుంటల్లోకి గంబూసియా చేపలను వదిలారు. బావులు, కుంటల్లో ఉన్న దోమల లార్వాలను ఈ చేపలు తింటాయని తెలిపారు. దీంతో దోమలు వ్యాప్తి చెందవన్నారు.కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమేష్, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



తహసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షిలోని తహసీల్దార్ కార్యాలయంను గురువారం ఉదయం పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ పునః ప్రారంభించారు. ఈ కార్యాలయం అధ్వాన స్థితికి చేరుకోవడంతో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మరమ్మతులు చేయించారు. కార్యాక్రమంలో వివిధ మండలాల నుంచి రెవెన్యూ సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



పావగడ: పట్టణ సమీపంలోని టీఎన్ పేటి గ్రామం పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 6 వ తరగతి విద్యార్థిని శశి రేఖ (11) మృతి చెందింది. టీఎన్‌పేటి గ్రామం రోడ్డు వద్ద తల్లిదండ్రులు బాలకృష్ణ, సౌభాగ్య(గొర్రెల కాపరులు)కు తాగునీరు తీసుకెళ్తుండగా పావగడ నుంచి పెనుగొండకు వెళ్తున్న కారు శశిరేఖను ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఒక్కగానొక్క కూతురు కన్ను మూసేసరికి తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఐ నరేంద్రపై చర్యలు తీసుకోవాలి

చిలమత్తూరు: లేపాక్షి ఎస్ఐ నరేంద్రపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. విలేకరులు మాట్లాడుతూ బుధవారం రాత్రి సివిల్ సెటిల్‌మెంట్ వ్యవహారంలో ఎస్ఐ నరేంద్ర చిలమత్తూరు స్టేషన్‌కు వచ్చారని, అదే అంశంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గొడవ జరిగిందన్నారు. ఈ ఘటనపై వివరాల కోసం మండల పాత్రికేయులు పోలీసు స్టేషన్‌కు వెళ్లగా దురుసుగా ప్రవర్తించారన్నారు. ఎస్ఐ తీరుపై అంబేడ్కర్ విగ్రహానికి విలేకరులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పవన్‌కుమార్, ఆంజనేయులు, విశ్వనాథ్, నరసింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాలు, సురేంద్రరెడ్డి, నాగార్జున, వెంకటేష్, రుద్రేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నీటితో నిండిపోయిన కమ్మయ్యగారిపల్లి ప్రధాన రహదారి



హిందూపురం శ్రీకంఠపురం వద్ద వివేకానంద పాఠశాల వద్ద భారీగా నిలిచిన నీరు

వర్షం వచ్చిందా.. రోడ్లు చిత్తడే

చిలమత్తూరు: చిన్నపాటి వర్షం వచ్చినా చిలమత్తూరు మండలంలోని పలు గ్రామాల రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. మట్టి రోడ్లు కావడం, కాంట్రాక్టర్లు బంకమట్టి రోడ్లపై తోలడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దానికి తోడు గుంతలు పడిపోవడంతో రోడ్లు నీటితో నిండిపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. హిందూపురంలో రోడ్లు దుస్థితి మరీ అధ్వానంగా ఉంది. రోడ్లు వేసినా సరైన ప్రణాళిక లేకపోవడంతో ఆ రోడ్లలో నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చిలమత్తూరు మండలంలో పలు గ్రామాలకు వెళ్లాలంటేనే ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. ద్విచక్ర వాహనాలైతే వెళ్లలేని పరిస్థితి. మండల పరిధిలోని శెట్టిపల్లి పంచాయితీలోని కమ్మయ్యగారిపల్లి రహదారి అధ్వాన్నంగా మారింది. మదురేపల్లి, తమ్మినాయనపల్లి, ఎస్.ముద్దిరెడ్డిపల్లి గ్రామాల రోడ్లన్నీ బురదమయంగా మారిపోయాయి. రహదారులు నిర్మిస్తామని 2018లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణ చిలమత్తూరులో పెద్ద శిలాఫలకం వేసి, ఆటువైపు కూడా చూడలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ రోడ్లు మంజూరు కాగా ఎన్నికలు రావడం, కూటమి గెలవడంతో ఆ రోడ్లు కావాలనే ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

శిలాఫలకాల్లో మాత్రమే కనిపిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ రూ.12.61 కోట్లు అభివృద్ధి పనులు



మోసం చంద్రబాబు నైజం



గుడిబండ మండలం ఎస్‌రాయాపురంలో మాట్లాడుతున్న ఈరలక్కప్ప. పార్టీ శ్రేణులు



అమరాపురంలో మాట్లాడుతున్న చౌళూరు మధుమతిరెడ్డి

గుడిబండ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని, ప్రజలకు మోసం చేయడం చంద్రబాబు నైజమని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని ఎస్ రాయాపురం, కొంకల్లు గ్రామంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలన్ని ప్రజలకు అందజేశామని, ఇక ఎవరైనా పథకాల గురించి అడిగితే వారిపై చర్యలు తప్పవంటూ ప్రజలను చంద్రబాబు భయపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి, మండల జేసీఎస్ అధ్యక్షుడు కొంకల్లు శివకుమార్, ఎంపీటీసీ సభ్యుడు కరియన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్, సర్పంచులు కవితటఋన్న, హాలిరాజు, గుడ్డదహళ్లి నాగరాజు, నాయకులు ఎస్ఎస్ గుండ్లు రాజు, రాయుడు, కురుబ మహలింగప్ప, చిత్తనగిరియప్ప, ఫణిరాజు, నయాజ్, వీరక్యాతరాయప్ప, రమేష్, ఈరన్న, హరీష్, లింగరాజు, సోమశేఖర్, తిప్పేస్వామి, నాగరాజు, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: కార్యకర్తలు జగనన్నను ముఖ్యమంత్రిని చేయడం కోసం సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అజ్జయ్యస్వామి దేవాలయ ఆవరణలో మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మధుమతిరెడ్డి, వాగేష్‌లు మాట్లాడుతూ ఈ నెల 10 లోపు గ్రామ స్థాయి కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. ఇంటింటికీ వెళ్లి బాబు చేసిన మోసాన్ని క్యూ ఆర్ కోడ్ ద్వారా వివరించాలన్నారు. అలాగే మన జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేయాలని కోరారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందన్నారు. వైఎస్సార్ జిల్లాలో జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలవలేమని తెలిసి సాక్షాత్తు ఓ ఎమ్మెల్సీని టీడీపీ నాయకులు కొట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీలు నారాయణ, నాగభూషణ, హనుమంతరాయ, సర్పంచ్ గోవిందరాయ,నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, స్థానిక నాయకులు నారాయణ, జేకే మూర్తి, అన్వర్, యంజేరప్ప, తిప్పేస్వామి, సిద్దేశ్వర, మల్లికార్జున, గిరిష్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి శంకరనారాయణ, గ్రామస్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీచరణ్‌రెడ్డి

రొద్దం: శేషాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పంచముఖ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట గురువారం ఘనంగా జరిగింది. ఉదయం పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేత శ్రీచరణ్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి

హిందూపురం: ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని మండలంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించకపోవడంతో బ్యాంకు ఖాతాలు స్తంభించాయని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో చెర్లోపల్లి నాగరాజు, బాలంపల్లి చంద్రప్ప, పరిమళమ్మ, మేనేసముద్రం నరసింహులు, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: ఆర్డీటీని కాపాడాలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ హనుమంతు, సీపీఐ పవిత్ర, సీపీఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

అమరాపురం: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సును పునరుద్ధరించాలని ఆర్డీటీ అభిమాన సంఘం నాయకులు, లబ్ధిదారులు డిప్యూటీ తహసీల్దార్ యునాష్‌కు వినతిపత్రం అందజేశారు. నారాయణ, శంకర్, జేకే.మూర్తి , కెంచప్ప తదితరులు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగళి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని ఆ సంస్థ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుబ్బరావుకు వినతి పత్రం అందజేశారు.

రాష్ట్ర స్థాయి లగోరి పోటీలకు ఎంపిక



లోటస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని డివిడిబిఎస్ విద్యాలయ క్రీడా ప్రాంగణంలో లగోరి జిల్లా స్థాయి పోటీలను గురువారం నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన లోటస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచి, మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో చిన్మయ విద్యాలయ, మూడో స్థానంలో లోటస్ పబ్లిక్ స్కూల్, వాసవీ స్కూల్స్‌లు విన్నర్స్‌గా నిలిచాయి. జిల్లా పరిషత్ పాఠశాల సంతేబిదనూరు, గొడనహళ్లి, శాసనకోట విద్యార్థులు వరుసగా 4, 5 స్థానాల్లో నిలిచాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 17న మైదుకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొననున్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు ట్రోఫీలను అందించారు. లగోరి గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, విద్యాలయ కరస్పాండెంట్ భీమరాజు, రఘునందన్ గుప్తా, మల్లికార్జున, బిందు, ఉష, సరళ, అశ్వత్థ నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వపు పోటీలకు ఎంపిక

హిందూపురం టౌన్: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎ.మదీహ రాష్ట్ర స్థాయి వక్తృత్వపు పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. గురువారం కళాశాలలో జోనల్ పోటీల్లో ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు కదపలోని ఎస్ఆర్‌సీ కళాశాలలో జోనల్ స్థాయిలో ఈనెల 6న 'సమాచార హక్కు చట్టం–2005' పై జరిగిన పోటీలలో విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 11న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి వక్తృత్వపు పోటీలకు ఎంపికైంది. జోనల్ స్థాయిలో డిబేట్‌లో ద్వితీయ స్థానం సాధించిన బీఎస్సీ విద్యార్థిని గౌతమి, క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన బీఎస్సీ విద్యార్థులు శ్రీనిధి, తనూష, నిహారికను వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీధర్, భోజప్ప, ఎల్ఆర్ రమేష్, ప్రకాష్ రావ్, రవి నాయక్, అశ్వర్థప్ప, నసీమ భాను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, బి. నరసింహులు అభినందించారు.

ఎరువులు సరఫరాలో సర్కారు వైఫల్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప

పావగడ: రైతులకు అవసరమైన ఎరువులు సమకూర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జేడీఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప ఆరోపించారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట గురువారం నిర్వహించిన రాస్తారోకో లో ఆయన మాట్లాడారు. యూరియా, డీఏపీ ఎరువులు సరఫరా చేయక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అలాగే పావగడలో నెల కొన్న తీవ్ర వర్షాభావం కారణంగా రైతులు వేరు శనగ విత్తనాలను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు రూ 20 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని కుమార స్వామి లే అవుట్‌ను వెంకటరమణప్ప లే అవుట్ గా మార్చకూడదని హెచ్చరించారు. తహసీల్దార్ వరద రాజుకు వినతి పత్రం అందించారు. జేడీఎస్ అధ్యక్షుడు ఎస్ఏ ఈరణ్ణ, జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, సొగడు వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్ఎంపీ మృతి



తలారి నాగరాజు(ఫైల్)

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దకాంబదేవి ఆలయం సమీపాన నివాసమున్న ఆర్ఎంపీ తలారి నాగరాజు(55) గురువారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరాజు మృతదేహానికి పలువురు ఆర్ఎంపీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

మడకశిరరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అభిమాన్యు స్పోర్ట్స్ కల్చర్ యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్ నాగేంద్ర గురువారం తెలిపారు. ఫైనల్ మ్యాచ్ 15వ తేదీ నిర్వహిస్తామన్నారు. విన్నర్స్ జట్టుకు రూ.15 వేల, రన్నర్స్ జట్టుకు రూ. 10 వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేస్తామన్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ట

పరిగి: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం వినాయక విగ్రహ ప్రతిష్టా గురువారం ఘనంగా జరిగింది. ఎంపీపీ సవిత ప్రభాకర్, ఎంపీడీఓ రెడ్డెప్ప, డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్, ఏఓ అశ్వర్థప్ప తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూర్వపు ఎంపీడీఓ సరస్వతి, కార్యాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని, ఇందులో భాగంగా తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు చేర్పించాలని రాజనహళ్లి గురు పీఠాధ్యక్షుడు వాల్మీకి ప్రసన్నానందపురి స్వామిజీ, సంజయ కుమార స్వామిజీ సూచించారు. తాలూకాలోని దేవలకెరె గ్రామంలో నిర్వహించిన ఓ శుభ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామాగ్రి వితరణ చేశారు. కార్యక్రమంలో శాంతలా రాజణ్ణ, స్థానిక ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, పాళేగార్ లోకేశ్, వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల తనిఖీ

పరిగి: మండల కేంద్రంలోని శ్రీరంగరాజుపల్లి రోడ్డులో ఉన్న బెల్లా పబ్లిక్ స్కూల్‌లో తరగతి గదులు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం సాయంత్రం ఎంఈఓ లక్ష్మీదేవి స్పందించి పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పనులపై యాజమాన్యంతో ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ వర్ధంతి

లేపాక్షి: లేపాక్షి శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

9న పేట వెంకటరమణుడికి పూజలు

హిందూపురం: పట్టణంలో పురాతన ఆలయమైన పేట వెంకటరమణస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శనివారం పురస్కరించుకొని పంచామృతాభిషేకం, సువర్ణ కవచ సేవ దర్శనం, ప్రాకారోత్సవం, మహామంగళహారతితో చేయనున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 8 వరకు నిర్విరామంగా విష్ణుసహస్రనామ పారాయణం జరుగుతుందన్నారు.

అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం పురపాలక సంఘ పరిధిలో 17 అనధికార లేఅవుట్లు గుర్తించినట్లు తెలిపారు. యజమానులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనధికార లేఔట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ పథకంద్వారా అనధికార లేఔట్లను లేదా అందులో ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. వీటికి సంబంధించిన సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌ను సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు(55) వ్యవసాయంలో నష్టాలు రావడంతో నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని అనంతపురం తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'అన్నదాత సుఖీభవ'పై ప్రత్యేక గ్రీవెన్స్

గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం అన్నదాత సుఖీభవ పథకం పై అధికారులు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 742 మంది రైతులకు సాంకేతిక కారణాలవల్ల అర్హత ఉన్నా పథకం మొత్తం అందలేదు. ఈసందర్భంగా రైతులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

పెనుకొండ రూరల్: అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందని వారి కోసం గురువారం రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ కోసం 122 మంది, తల్లికి వందనం పథకం కోసం 92 వినతులు అందినట్లు తహసీల్దార్ కే.స్వామి తెలిపారు.

స్వచ్ఛ కమిటీల ఏర్పాటు

మడకశిర: పట్టణ పరిధిలోని ప్రతి వార్డులో స్వచ్ఛ కమిటీల ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ గురువారం తెలిపారు. ప్రతి వార్డులో కౌన్సిలర్ స్వచ్ఛ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. సచివాలయాలకు సంబంధించిన ఇంజినీరింగ్, శానిటేషన్, మహిళా పోలీస్, ఏఎన్ఎం శాఖల సెక్రటరీలు, ఆర్పీలు, స్వచ్ఛ అంబాసిడర్లుగా ఉంటారన్నారు. ప్రతి వీధి నుంచి ఒక స్వచ్ఛ అంబాసిడర్‌ను ఏర్పాటు చేసి వారి ద్వారా వీధుల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించి స్వచ్ఛ మడకశిరకు కృషి చేయాలని ఆయన కోరారు.

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

మడకశిర: పట్టణంలోని 7,9,10,11,12వ వార్డుల పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు తేరువీధిలోని వేంకటరమణస్వామి ఆలయం వద్ద బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ ఇన్‌చార్జ్ భారతిరెడ్డి దేశాయి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై చంద్రబాబు మోసాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చదువులో విద్యార్థులు రాణించాలి

మడకశిర: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ భాస్కర్ కోరారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ముఖ్యమన్నారు. ఇంటర్ విద్య చాలా కీలకమని, విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఈఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బషీరున్నీసా, కళాశాల చైర్మన్ గుండుమల రామాంజి, వైస్ ప్రిన్సిపాల్ కర్ణానాయక్,అధ్యాపకుడు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

10లోపు గ్రామ కమిటీ వివరాలు అందజేయండి

రొళ్ల: మండల వ్యాప్తంగా పది పంచాయతీల పరిధిలోని గ్రామ కమిటీ వివరాలను ఈ నెల 10లోపు మండల ఇన్‌చార్జ్ నాగమణికి అందజేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ స్థాయిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని రొళ్ల మండలంలో మొదటి విడత కార్యక్రమం పూర్తి చేశామన్నారు. దీంతో రైతు, యువజన విభాగం, మహిళ విభాగంతో పాటు సోషల్ యాక్టివిటీఎస్ వంటి కమిటీలను గ్రామ స్థాయిలో చురుగ్గా పని చేసే నాయకులను ఎంపిక చేయాలని సూచించారన్నారు. అలాగే ఈనెల 24 నుంచి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



సూగూరులో పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నేతలు

చిలమత్తూరు: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ మండిపడ్డారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రచారం చేయడానికి వెళ్లిన బీసీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు దాడి చేయడం సరికాదన్నారు. గురువారం హిందూపురంలోని సూగూరు వద్ద ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక పిలుపు మేరకు బీసీ సెల్ నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహామూర్తి, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, రూరల్ మండల కన్వీనర్ రాము, సర్పంచ్ ఆనంద్, సూర్యమోహన్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, మనోజ్ గౌడ్, బండి రాము, కృష్ణమూర్తి, అమానుల్లా, గాంధీ, శ్రీనాథ్, అయూబ్ బైగ్, శ్రీరాములు గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

సోమందేపల్లి: మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని కార్మికులు గురువారం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికుల పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో చేనేత పరిశ్రమ ప్రధాన వృత్తి అని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం నాయకులు శీలా నారాయణ స్వామి, నర్సింహులు, సుధాకర్, కిష్టప్ప, ఈశ్వర్, వెంకటేష్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం కొనసాగించాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని కొనసాగించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీను రద్దు చేయాలని, వర్క్ షెడ్‌తో కూడిన ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, రాజ్ గోపాల్, గంగాధర్, చంద్రశేఖర్, మారుతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ

మడకశిర: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగింది. ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రవి, శంకర్, నవీద్, డాక్టర్ ఆంజినేయులు, నాగేంద్ర, ఫిజికల్ డైరెక్టర్లు మంజునాథ్, విజయ్‌కుమారి, కోచ్‌లు బాలాజీ, జగదీష్ ఆధ్వర్యంలో టోర్నీ హోరాహోరీగా సాగింది. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా సీఐ నగేష్ హాజరయ్యారు. సీనియర్ క్రీడాకారులు నాగేంద్ర, వేణు కూడా పాల్గొన్నారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు సీఐ నగేష్ ట్రోఫీలు, బహుమతులు అందించారు.